నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్ బుధవారం 24 ఏప్రిల్ 2024 | ADILABAD NIRMAL

## గాలివాన బీభత్సం


కుభీర్‌లో నేలవాలిన జొన్న పంట

కుభీర్, ఏప్రిల్ 23 : మండలంలో ఉరుములు మెరుపులతో కూడిన గాలి వాన బీభత్సాన్ని సృష్టించింది. సోమవారం రాత్రి వీచిన బలమైన గాలులతోపాటు వర్షం కురిసింది. దీంతో అక్కడక్కడ చెట్లు విరిగి పడిపోగా.. కరెంటు స్తంభాలు నేలకొరిగాయి. ఇళ్ల పైకప్పుల రేకులు, గూన ఇండ్లపై కప్పిన పాలిథిన్ కవర్లు గాలికి లేచిపోయాయి. చేతికొచ్చిన మొక్కజొన్న, నువ్వు, జొన్న పంటలు నేలవాలాయి. కల్లాలపై ఆరబోసిన మొక్కజొన్న తడిసి ముద్దయింది. మండల రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లింది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో మంగళవారం ఉదయం నుంచి తాగునీరు, వాడుకునే నీటి కోసం మండలంలోని అన్ని గ్రామాలలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## భారీ మెజార్టీతో గెలిపించాలి..

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీని సన్మానిస్తున్న శ్రీరాం నాయక్


ఉట్నూర్ రూరల్, ఏప్రిల్ 23 : బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండే విఠల్‌లు అన్నారు. బుధవారం ఎంపీ అభ్యర్థి ఆదిలాబాద్‌లో నామినేషన్ వేసి తిరుగు ప్రయాణంలో లింగోజితండాలో ఇంద్రవెల్లి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీరాం జాదవ్ నివాసంలో నాయకులతో కలిసి మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, కాంగ్రెస్ ప్రభుత్వ తప్పిదాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ నాయకులు ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయాలన్నారు. బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్, బీఆర్‌ఎస్ సోషల్ మీడియా నాయకుడు బాబా శ్యాం పాల్గొన్నారు.


పెండల్‌వాడలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి రామన్న, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

## రాష్ట్రాభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం..

### మాజీ మంత్రి జోగు రామన్న

జైనథ్, ఏప్రిల్ 23 : ఉద్యమం ద్వారా తెలంగాణను సాధించుకున్నామని, మాజీ సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి జోగు రామన్న స్పష్టం చేశారు. మంగళవారం పెండల్‌వాడ గ్రామంలోని ఆత్మ లింగ హనుమాన్ ఆలయం బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కుతో కలిసి ప్రత్యేక పూజలు చేసి ప్రచారాన్ని ప్రారంభించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి చేసింది ఏమి లేదన్నారు. బూటకపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు, రైతులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నిరుద్యోగులు, రైతులు మహిళలను తీవ్రంగా మోసం చేసిందన్నారు. రూ.2 లక్షల రుణమాఫీపై కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోవర్ధన్, మాజీ ఎంపీపీ లింగారెడ్డి, గిమ్మ ఎంపీటీసీ కోల భోజన్న, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యాసం నర్సింగ్‌రావ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కల్చప్ రెడ్డి పాల్గొన్నారు.

## రూ.25 వేల జరిమానా

### బిగ్ బావర్చి హోటల్‌లో అధికారుల తనిఖీ


బిర్యానిని పరిశీలిస్తున్న ఆహార భద్రత అధికారి శ్రీధర్

ఎదులాపురం, ఏప్రిల్ 23 : ఆదిలాబాద్ పట్టణంలోని బిగ్ బావర్చి ఫ్యామిలీ రెస్టారెంట్‌లో సోమవారం వెజ్ బిర్యానీలో బొద్దింక వచ్చిన విషయం తెలిసిందే. మంగళవారం ఆహార భద్రత అధికారి శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ ఖమార్ అమాద్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేందర్‌లతో కలిసి బిగ్ బావర్చి హోటల్‌లో తనిఖీలు చేపట్టారు. రెస్టారెంట్ కిచెన్ సెక్షన్, రికార్డులను పరిశీలించారు. శానిటేషన్ విషయంలో నాణ్యతా ప్రమాణాలను పాటించకపోవడం వల్ల రూ.25 వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. త్వరలో మున్సిపల్, ఆహార భద్రత అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహిస్తామన్నారు. నిర్వహణలో మార్పులు లేని పక్షంలో ఆహార భద్రతా చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బిగ్ బావర్చి హోటల్‌లో కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల, శానిటేషన్ పాటించకపోవడంతో ఆహార భద్రత శాఖ ద్వారా 15 రోజుల్లోగా మెరుగు పరుచుకోవాలని నోటీసులు ఇచ్చామన్నారు. అలాగే నాలుగు రకాల ఆహార శాంపిల్స్‌ను హైదరాబాద్ ల్యాబ్‌కు టెస్టులకు పంపించామన్నారు. ఆ ఫలితాలు వచ్చిన వెంటనే ఆహార భద్రత చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.


కల్లూరులో అధికారులకు సూచనలు ఇస్తున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

## తాగునీటికి ఆటంకం లేకుండా చూడాలి

- గ్రామాల్లో పారిశుధ్య పనులను కొనసాగించాలి..
- ప్రభుత్వ పాఠశాలలో వసతులు కల్పించాలి..
- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

కుంటాల, ఏప్రిల్ 23 : వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సరఫరాకు ఆటంకం లేకుండా చూడాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. మంగళవారం ఆయన కల్లూరులో పర్యటించారు. అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ బడుల్లో గుర్తించిన సౌకర్యాలను త్వరితగతిన పూర్తి చేసి వచ్చే విద్యాసంవత్సరానికికల్లా అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. ఎండాకాలం దృష్ట్యా గ్రామాల్లో రద్దీ ఉండే చోట గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అన్నారు. వెంట ఎంపీడీవో అబ్దుల్ రహీం, గ్రామ ప్రత్యేకాధికారి సోమలింగా రెడ్డి, ఏపీవో నవీన్, సెక్రెటరీ భోజన్న ఉన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

## పనులన్నీ పూర్తి చేయాలి..

### నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 23 : పాఠశాలలు తెరిచేలోపు అభివృద్ధి పనులన్నీ పూర్తి చేయాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మామడ మండలంలోని కొత్త లింగంపల్లి ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, డీఈవో రవీందర్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ ఈఈ శంకరయ్యతో కలిసి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పాఠశాల పరిధిలోని మండలాల ఏఈలు క్షేత్ర స్థాయిలో పరిశీలించి అత్యవసరమైన పనులను పూర్తి చేయాలని ఇంజినీర్లను ఆదేశించారు. కొత్త లింగంపల్లి పాఠశాలలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల మరమ్మతుల పని నిమిత్తం రూ.1.97 లక్షలు అవసరమని నిర్ణయించి పరిపాలన అనుమతులు మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు రాజేశ్వర్, ప్రవీణ్, డీసీఈబీ కార్యదర్శి భానుమూర్తి, సర్పంచ్ గంగాధర్, వీవో చైర్మన్ సాయవ్వ, తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్‌దే విజయం

- సీఎం రేవంత్‌రెడ్డి ఒట్టేసి కొత్త నాటకాలు ఆడుతున్నారు
- బీజేపీ పాలనలో ఒరిగిందేమీ లేదు
- నామినేషన్ కార్యక్రమంలో ఆత్రం సక్కు


ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో నామినేషన్ మొదటి సెట్‌ను ఎన్నికల అధికారికి ఇస్తున్న ఎంపీ అభ్యర్థి సక్కు, మాజీ మంత్రి రామన్న, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, కోవ లక్ష్మి


నామినేషన్ వేసేందుకు ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ వస్తున్న ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, మాజీ మంత్రి జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్

ఆదిలాబాద్, ఏప్రిల్ 23(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ఘన విజయం సాధిస్తుందని పార్టీ అభ్యర్థి ఆత్రం సక్కు తెలిపారు. బుధవారం ఆయన బోథ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవ లక్ష్మి, మాజీ మంత్రి జోగు రామన్న, సీనియర్ మైనార్టీ నాయకుడు యూనిస్ అక్బానీతో కలిసి కలెక్టర్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి రాజర్షి షాకు నామినేషన్ సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పదేండ్ల పాలనలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులు, పేదలు, బడుగు, బలహీన వర్గాల ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారని తెలిపారు. తెలంగాణ ప్రజల హక్కుల పరిరక్షణ, విభజన హామీలు ఇతర సమస్యల గురించి పార్లమెంట్‌లో గొంతెత్తడానికి బీఆర్‌ఎస్ ఎంపీలు ఆవశ్యకత ఉందన్నారు. తెలంగాణ ప్రజలకు బీఆర్‌ఎస్ పార్టీ శ్రీరామ రక్ష అని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ కళ్లబొల్లి మాటలు, ఆచరణలో సాధ్యం కాని హామీలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. ఆరు గ్యారెంటీలతోపాటు 420 హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డిసెంబరు 9న రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీని అమలు చేస్తానని చెప్పారని, ఇప్పుడు ఆగస్టు 15 అంటూ దేవుళ్ల మీద ఒట్టేసి కొత్త నాటకాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోనియాగాంధీపై నమ్మకం లేక దేవుడిపై ఒట్టు పెడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యక్తిగత ఆరోపణలు మానుకుని గ్యారెంటీల అమలుకు కృషి చేయాలని సూచించారు.

### పదేళ్లలో బీజేపీ చేసిందేమీ లేదు..

పదేండ్లు అధికారంలో ఉన్న బీజేపీ జిల్లా ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న జిల్లా సమస్యలను ప్రస్తావించకపోవడం శోచనీయమని తెలిపారు. ఆదిలాబాద్ సిమెంట్ పరిశ్రమ, విమానాశ్రయం, ఆర్మూర్, ఆదిలాబాద్ రైల్వేలైన్, రెబ్బెన ఓవర్ బ్రిడ్జి వంటి సమస్యలను బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. గత ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు బీజేపీ ఎంపీని గెలిపించినా ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా ఉన్న తాను ప్రజల సమస్యలను పరిష్కరించానని, ప్రజలు తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తుల శ్రీనివాస్, దాసరి రమేశ్, జంగిలి ప్రశాంత్ ఉన్నారు.


ఆదిలాబాద్‌లో ఆత్రం సక్కు రెండో సెట్ నామినేషన్ వేసి బయటకు వస్తున్న ఎమ్మెల్సీ విఠల్, నాయకులు జాన్సన్ నాయక్, శ్యాం సుందర్, రామకిషన్‌రెడ్డి

### ఆరో రోజు.. ఆరు నామినేషన్లు..

ఎదులాపురం, ఏప్రిల్ 23 : లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా మంగళవారం ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఆరో రోజు ఆరు నామినేషన్‌లు దాఖలు అయ్యాయని జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఆత్రం సక్కు రెండు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. అలాగే ఇండియా ప్రజాబంధు పార్టీ నుంచి సాగర్ రెండు నామినేషన్లు, పట్టణానికి చెందిన మెస్రం గంగాదేవి(స్వతంత్ర), ఉట్నూర్ బోయవాడ చవాన్ రాము (స్వతంత్ర) అభ్యర్థికి సంబంధించి నామినేషన్లు దాఖలు చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి మాజీ మంత్రి జోగు రామన్న, ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండే విఠల్, బీఆర్‌ఎస్ నాయకులు జాన్సన్ నాయక్, లోలం శ్యాంసుందర్, రామ్‌కిషన్‌రెడ్డి, మరుకోల సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

## రేవంత్‌రెడ్డిలో ఓటమి భయం

- ప్రజలను భయపెట్టే ప్రయత్నాలు
- కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదు చేస్తాం
- గిరిజన అభ్యర్థిని అవమానించినందుకు క్షమాపణ చెప్పాలి
- మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, ఏప్రిల్ 23(నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఓటమి భయం నెలకుందని, అభద్రతాభావంతో ఆయన ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. మంగళవారం బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైందన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు అంతర్గత ఒప్పందం కుదుర్చుకున్నాయని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అత్రం సుగుణ ఓడిపోతే ఆరు గ్యారెంటీలు అమలు కావని ప్రజలను బెదిరింపులకు గురి చేస్తున్నారన్నారు. ఓటమి భయంతో కాంగ్రెస్ ఓడిపోతే ప్రజలు నష్టపోతారనే ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు రేవంత్ వ్యాఖ్యలు ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందికి వస్తాయని ఆయనపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. గతంలో ఆదిలాబాద్ పర్యటనలో మోదీని బడే భాయ్ అన్న రేవంత్ ఇప్పుడు ప్రధానిని విమర్శించడం ఆయన ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. మాజీ ముఖ్యంత్రి రేవంత్‌రెడ్డిపై అవినీతి ఆరోపణలు చేస్తున్న రేవంత్ ఓటుకునోటు దొంగ అని, పలు అక్రమాలకు పాల్పడ్డారన్నారు. సోమవారం ఆదిలాబాద్‌లో నిర్వహించిన కాంగ్రెస్ ప్రచారం సభకు ప్రజలు హాజరుకాలేదని, రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందన్నారు.

### రేవంత్ క్షమాపణలు చెప్పాలి..

బీఆర్‌ఎస్ అభ్యర్థి అత్రం సక్కుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి క్షమాపణలు చెప్పాలని జోగు రామన్న డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి అహంకారపూరిత మాటలు మాట్లాడుతున్నారని, ఎస్సీ, ఎస్టీ, బీసీలను అనుమానించేలా వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. బీజేపీ పదేళ్ల పాలనలో ఆదిలాబాద్ జిల్లాకు అన్ని రంగాల్లో అన్యాయం జరిగిందని తెలిపారు. సిమెంటు పరిశ్రమను ప్రారంభిస్తామని హామీ ఇచ్చిన మోదీ ప్రభుత్వం సీసీఐ ప్రారంభం విషయంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్ని లేఖలు రాసిన స్పందించలేదన్నారు. రేవంత్ రెడ్డి సీసీఐని ప్రైవేటు వ్యక్తులకు అప్పచెబుతామని చెప్పడం వెనుక ఆయన కమిషన్ల కోసం ఆరాటపడుతున్నట్లు స్పష్టమవుతుందన్నారు. బీజేపీ పాలనలో ఆర్మూర్ ఆదిలాబాద్ రైల్వేలైన్, విమానాశ్రయం, నవోదయ స్కూల్ పెండింగ్ సమస్యలు పది సంవత్సరాల్లో పరిష్కారం కాలేదని తెలిపారు. ఈ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు తగిన బుద్ధి చెబుతారన్నారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆదిలాబాద్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు యూనిస్ అక్బానీ, విజ్జిగిరి నారాయణ, సాజిదొద్దీన్, గోవర్ధన్ పాల్గొన్నారు.

## కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి..

- మాజీ మంత్రి జోగు రామన్న
- ఉమ్మడి జిల్లా నేతల సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, ఏప్రిల్ 23 : పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సైనికుల్లా పని చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న పిలుపునిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఉమ్మడి జిల్లా నేతలు, బోథ్ ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండె విఠల్, ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు ముఖ్యనేతలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో గెలుపు కోసం చేపట్టాల్సిన కార్యాచరణ, ప్రణాళిక ఇతరత్రా అంశాలపై శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో భాగంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన సంక్షేమ పథకాల తీరును గుర్తు చేయాలన్నారు. అదేవిధంగా త్వరలోనే మాజీ సీఎం కేసీఆర్ బహిరంగ సభ ఆదిలాబాద్‌లో ఉంటుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కేసీఆర్ పర్యటిస్తున్నారని, ఇందులో భాగంగానే కాగజ్‌నగర్, ఆదిలాబాద్‌లలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యకర్తలు సభను జయప్రదం చేయాలన్నారు. ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో భాగంగా అన్ని మండల కేంద్రాల్లో పర్యటిస్తానని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.


## కేసీఆర్ వివాహ వార్షికోత్సవం సందర్భంగా పూజలు

### బీఆర్‌ఎస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి నామినేషన్ దాఖలు


అమ్మవారి సన్నిధిలో బీఆర్‌ఎస్ నాయకులు

బాసర, ఏప్రిల్ 23 : బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు వివాహ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం సరస్వతీ అమ్మవారి ఆలయంలో ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, బీఆర్‌ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా మంగళవారం ఎంపీ అభ్యర్థిగా ఆయన నామినేషన్ దాఖాలాలు చేయనుండగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈయన వెంట ముథోల్ నియోజకవర్గ సమన్వయకర్త సభ్యులు కిరణ్ కొమ్రెవార్, పార్టీ కన్వీనర్ కోర్వశ్యామ్, సీనియర్ నాయకులు ప్రతాప్‌రావు, మారుతి బెండే, నాగనాథ్, సురేశ్ పటేల్, సదానంద, రవి, శ్రీనివాస్, లక్ష్మణ పీరాజీ పాల్గొన్నారు.

## గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్



భైంసా : మాట్లాడుతున్న ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 23 : నిర్మల్ పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. సోమవారం నిర్మల్ పట్టణంలోని కురన్నపేట్ మున్నూరుకాపు సంఘం వద్ద ఎస్సై రాజేశ్వర్ గౌడ్ తన సిబ్బందితో వాహనాలను తనిఖీ చేస్తున్నాడు. ఈ క్రమంలో తోకల రాజేశ్వర్ ప్లాస్టిక్ కవర్‌లో 245 గ్రాముల విడి గంజాయిని తీసుకుని అతని కస్టమర్‌కు విక్రయిద్దామని వెళ్తున్నాడు. ఈ క్రమంలో అనుమానం వచ్చి రాజేశ్వర్‌ను తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. ఆయనను విచారించగా షేక్ సోహెల్ వద్ద కొని ఇతరులకు అమ్ముతున్నట్లు తెలిపాడు. గంజాయిని స్వాధీన పర్చుకుని షేక్ అమీర్ సోహెల్ కోసం గాలిస్తుండగా మంగళవారం బస్టాండ్ వద్ద పట్టుబడ్డాడు. ఇతని వద్ద నుంచి 139 గ్రాముల గంజాయి, గంజాయి అమ్మగా వచ్చిన డబ్బులు రూ.4,140, టీఎస్ 11ఈపీ 5702 మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో పట్టణ సీఐ అనిల్ కుమార్, ఎస్సై రాజేశ్వర్ ఉన్నారు.

### మరో ఇద్దరు..

భైంసా, ఏప్రిల్ 23 : భైంసా పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని సోమవారం రాత్రి అరెస్ట్ చేసినట్లు ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. పట్టణంలోని ఖాజీగల్లికి చెందిన ముజాహిద్ ఖాన్, రాహుల్ నగర్‌కు చెందిన షేక్ మక్బూల్ బస్టాండ్ వద్ద గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్సై షరీఫ్ సిబ్బందితో కలిసి చేరుకున్నారు. దీంతో పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 1,142 గ్రాముల పొడి గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిని అదుపులోకి తీసుకుని విచారించగా మహారాష్ట్రలోని నాందెడ్‌కు చెందిన షరీఫ్ నుంచి పది రోజుల కిందట 2 కిలోల పొడి గంజాయి తెచ్చినట్లు వెల్లడించారు. పట్టణానికి చెందిన మహ్మద్ బారికి 250 గ్రాములు, తురాబ్ ఖాన్‌కు 209 గ్రాములు, రాహిల్‌కు 100 గ్రాములు విక్రయించినట్లు వెల్లడించారు. నాందెడ్‌కు చెందిన షరీఫ్‌తోపాటు స్థానికంగా గంజాయి కొనుగోలు చేసిన ముగ్గురిని త్వరలోనే పట్టుకుంటామని ఏఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో సీఐ రాజారెడ్డి, ఎస్సై షరీఫ్ ఉన్నారు.



నిర్మల్ అర్బన్ : వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి